



పాఠకులకు గమనిక

భారీ వర్షాలతో రోడ్లు, రైల్వే మార్గాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ కారణంగా నేటి సంచికతో వచ్చే ఆదివారం మ్యాగజైన్‌ను అందించలేకపోతున్నాం. తిరిగి సండే బుక్ ఇచ్చే తేదీని తెలియపరుస్తాం. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

- మేనేజ్‌మెంట్


కొనసాగుతున్న వీఆర్ సెంబర్-5లోని నాలుగు గేట్లు

శాంతించిన మంజీరా

నిజాంసాగర్‌కు తగ్గిన వరద

నిజాంసాగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ మంజీరా నుంచి వచ్చే వరద నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగిన 23 గేట్ల నుంచి 14 గేట్లను మూసివేశారు. తొమ్మిది గేట్ల ద్వారా ప్రాజెక్టు నుంచి వరద నీటిని దిగువ మంజీరాకు విడుదల చేస్తూనే ఉన్నారు. ప్రాజెక్టులో పూర్తి నీటి మట్టం విలువ చేసేందుకు వచ్చే 91,887 క్యూసెక్కుల వరద నీరువస్తూ ఉన్నందున ప్రాజెక్టు దిగువకు 59,334 క్యూసెక్కుల నీటిని (మిగతా 8వ పేజీలో)



- భారీ శబ్దాలతో ఆరోగ్యానికి పెనుముప్పు.. మృత్యువాత
- హెచ్చరికలకే పరిమితమైన అధికార యంత్రాంగం
- వేడుకలు, ఫంక్షన్లలో తప్పనిసరిగా మారిన తంతు
- ఉత్సవాల్లో డీజే లేకుండా చేయాలంటున్న ప్రజలు

డీజేలు.. యమ డేంజర్

డీజే (డిస్క్ జాకీ), టపాసుల వినియోగం నానాటికీ పెరుగుతోంది. మితిమీరిన శబ్దాలను వెలువరిస్తున్న డీజేలు ప్రాణాలను తోడేస్తున్నాయి. శబ్దాల హోరుకు వృద్ధులు, పిల్లలతో పాటు యువత బలవుతున్నారు. హుషారుగా నృత్యం చేస్తున్న యువకులు ఉన్నట్లుండి కుప్పకూలుతున్నారు. అధిక శబ్దాలతో గర్భంలోని శిశువులపై కూడా దుష్ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఉత్సవాల వేళ జనం భారీ సౌండ్‌లతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాధారణంగా ఆరోగ్యవంతులు 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకు మించితే కష్టమే.

సండే స్పెషల్
SUNDAY SPECIAL

నిజామాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శబ్ద తీవ్రతను కొలవడానికి డెసిబుల్ (డీబీ) అనే ప్రమాణాలను వినియోగిస్తారు. నివాస ప్రాంతాల్లో సాధారణంగా 50 డీబీల శబ్దస్థాయి ఉంటుంది. ఐక్యరాజ్య సమితి నిర్వచనం ప్రకారం.. 65 డెసిబుల్స్ శబ్దస్థాయి దాటితే శబ్ద కాలుష్యానికి దారిస్తోంది. తీవ్రత 85 డెసిబుల్స్ దాటితే హానికారక ప్రతికూల ప్రభావాన్ని చూపుతూ కాలుష్యానికి కారణమవుతోంది. పెళ్లిళ్లు, జాతరలు, పూజలు, శుభ, అశుభ సామాజిక, మతపరమైన కార్యక్రమాల్లో అధిక శబ్దాలను వెదజల్లే డీజే మోతలతో మానవ, జంతు ఆరోగ్యాలపై సత్వరమే దుష్ప్రభావం కలుగుతుంది. డీజే మోతలను భరించలేక వెంటనే కుప్పకూలిపోయి ప్రాణాలను కోల్పోయిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి.

గర్భిణులపై తీవ్ర ప్రభావం

శబ్ద కాలుష్యం గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గర్భధారణ తర్వాత (మిగతా 8వ పేజీలో)

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు

- సంపత్‌కుమార్, భిక్కనూరు సీఐ

వినాయక చవితి ఊరేగింపులు, ఎలాంటి వేడుకలకు డీజే అనుమతి లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరైనా డీజేలు పెడితే మండప నిర్వాహకులతో పాటుగా డీజే యజమానిపై కేసులు నమోదు చేయడంతో పాటు డీజే బాక్స్‌లను, వాహనాన్ని సీజ్ చేస్తాం. గ్రామంలో తమ సిబ్బంది నిఘా పెట్టారు. ఎవరైనా డీజే పెట్టినట్లు తమ దృష్టికి వస్తే ఎంతటి వారైనా సహించేది లేదు. ఎక్కడైనా డీజేలు ఉపయోగిస్తున్నట్లు ఉంటే 100 సమాచారం అందించాలి.


పాత జాతీయ రహదారిని పునరుద్ధరిస్తున్న దృశ్యం

కోలుకుంటున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల క్రితం భారీ వర్షానికి, వరదలకు ఇబ్బందులకు గురైన జీఆర్ కాలని, కౌండిన్యకాలని, హౌసింగ్ బోర్డు కాలనీవాసులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. శనివారం సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ పర్వేజ్ ఆధ్వర్యంలో ప్రతీ ఇంట్లో ఉన్న బురదను తొలగించే ప్రయత్నం చేశారు. పరిసరాలలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది సైతం సహాయక చర్యల్లో పాల్గొని ప్రజలకు సేవలు అందించారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వివిధ పార్టీల నాయకులు, బాధిత కుటుంబీకుల స్నేహితులు, బంధువులు ఆహారం, నీరు, దుప్పట్లు అందించారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. అయితే కొన్ని ఇళ్లలో ఇంకా వరదనీటికి తడిచి స్విచ్‌లు తడిగా ఉండడంతో విద్యుత్ రాలేదు వారికి సైతం విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇక వాగులోని నీటి ఉధృతి క్రమక్రమంగా తగ్గడంతో ప్రవాహానికి కొట్టుకుపోయిన వాహనాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. వాగు ఇరువైపులా భారీ బుంగలు పడడంతో అధికారులు తాత్కాలిక రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టారు. పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో గుంతలు పూడ్చి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నారు.


కామారెడ్డి పెద్దచెరువు ప్రధాన కాలువ పక్కనే ఏర్పాటు చేసిన వెంచర్

ఈ పాపం ఎవరిది?

- కొందరు నేతలు, అధికారుల పనితీరు పాపమేనా?
- కబ్జాలతోనే కామారెడ్డి ముంపునకు గురైందా?
- కబ్జాలో పెద్ద చెరువు వాగు కాలువలు
- కాలువ కుచ్చించుకుపోవడంతో పెరుగుతున్న వరద ప్రవాహం
- కాలువలను ఆనుకొని వెంచర్ల ఏర్పాటు
- బఫర్ జోన్‌లో భవనాల నిర్మాణాలు
- భారీ వర్షాల సమయంలో ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు
- చిన్నపాటి చినుకులకే కాలనీలు, రోడ్లన్నీ జలమయం

కామారెడ్డి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పెద్దచెరువు పరివాహక ప్రాంతంలోని వరద కాలువలు, పిల్ల కాలువలు ఎక్కడికక్కడ కబ్జాలకు గురవడంతో గతంలో ఉన్న కాలువల విస్తీర్ణం ఇప్పుడు లేకుండా పోయింది. మరికొన్నిచోట్ల కాలువల పక్కన బఫర్‌జోన్‌ను విడువకుండా నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరు పారేందుకు అవకాశం లేకుండా పోయింది. గత నాలుగు రోజుల కిందట వచ్చిన వరదలకు పెద్ద ఎత్తున కాలువలు కబ్జాలు అయ్యాయనే వాదనలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా పది సంవత్సరాల కిందటి నుంచి కామారెడ్డి పెద్దచెరువు అలుగు పారుతుందంటే కాలువ పరివాహక ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు చేసుకున్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ప్రతీ ఏడాది ఎంతో కొంత వరద ప్రభావం కాలువ ఇరుపక్కల నిర్మాణాలు చేపట్టిన కాలనీవాసులకు ఇబ్బందులు పెడుతునే ఉంది. ఈ ఏడాది అతి భారీ వర్షం పడడంతో ఇతర ప్రాంతాల్లోని చెరువుల నీరు కామారెడ్డి చెరువులోకి చేరి వరద నీటి ప్రవాహం ఎక్కువైంది. దీంతో గతంలో ఇంటి గేటు వరకు వచ్చిన నీరు ఇప్పుడు ఏకంగా ఇంట్లోని మొదటి అంతస్తు వరకు వచ్చాయి. ప్రస్తుతం ఆయా కాలనీల్లో కొన్నిచోట్ల బఫర్ జోన్‌లలో ఇంటి నిర్మాణాలు చేపట్టారని వాటితోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే వాదనలు ఆ కాలనీల్లో నివసించే కొందరి నుంచి వినిపించడం గమనార్హం. అసలు ఈ ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన అధికారులు, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేసేందుకు ఒత్తిడి తెచ్చిన నేతలు చేసిన పాపం ఇతరులకు చుట్టుకుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కామారెడ్డికి ప్రాణం పెద్ద చెరువు

కామారెడ్డి గ్రామీణ ప్రాంతంగా ఉన్నప్పుడు నిర్మాణం చేపట్టిన పెద్ద చెరువుతో దాదాపు 9 వందల ఎకరాల వరకు పంటలు పండేవని అప్పటి పెద్దలు చెప్పుకొస్తున్నారు. ఈ చెరువు నీటితో పంటల సాగుకు మాత్రమే ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చేవారు. కాలక్రమేణా కామారెడ్డిలో పంటల సాగు తగ్గిపోవడం, పట్టణం విస్తరించడం, నివాస గృహాలు పెరిగిపోవడం మున్సిపాలిటీగా మారడంతో సాగునీటి అవసరాలకు ఉపయోగపడిన చెరువు తాగునీటి అవసరాలకు వినియోగించేలా మారిపోయింది. ప్రస్తుతం పాత కామారెడ్డికి తాగునీటి సరఫరా ఈ చెరువు ద్వారానే సరఫరా అవుతోంది. అయితే పెద్దచెరువు ఎగువ భాగాన్ని రాజంపేట, తాడ్వాయి, లింగాపూర్, చిన్నమల్లారెడ్డి తదితర గ్రామాల్లో కురిసిన వర్షాలకు చెరువులు నిండి అలుగు దూకుతుండేవి. ఆ నీరు కామారెడ్డి చెరువు నిండిన తర్వాత అలుగు దూకుతోంది. ఈ నీరు పెద్దవాగులోకి చేరి అక్కడ నుంచి పిల్ల కాల్వల ద్వారా ఇతర ప్రాంతాలకు చేరుతోంది.

కబ్జాకు గురైన పెద్ద చెరువు కాల్వలు

వానాకాలం సమయంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెద్ద చెరువులోకి వరద వస్తోంది. అయితే భారీ వర్షాలు కురిస్తే పెద్దచెరువు పూర్తిగా నిండి అలుగుదూకేది. అయితే అలుగు దూకిన సమయంలో చెరువు ప్రధాన కాల్వ ద్వారా వాగు పారుతుండేది. గతంలో ఈ ప్రధానకాలువ చాలా పెద్దగానే ఉండేది. ఈ వాగు కాల్వతో పాటు మూడు, నాలుగు (మిగతా 8వ పేజీలో)


ప్రధాన కాలువను కబ్జా చేసి నిర్మాణం చేపట్టడంతో వరదకు కొట్టుకుపోయిన దృశ్యం


భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయ కోనేరులో నీరు వచ్చిన దృశ్యం

35 ఏళ్ల తర్వాత సిద్ధరామేశ్వర ఆలయ పుష్కరిణిలో నీరు

భిక్కనూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయ పుష్కరిణికి జలకళ సంతరించుకుంది. గత 35 సంవత్సరాల క్రితం ఈ పుష్కరిణిలో నీరు ఉండేదని రానురాను ఈ పుష్కరిణి శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు తెలిపారు. గత కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థలు ఈ పుష్కరిణి(మెట్లబావి)ని బాగు చేయించి కొత్త రూపాన్ని తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఈ పుష్కరిణి సెల్ఫీలకు కేరాఫ్‌గా మారింది. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఈ పుష్కరిణికి నిండా నీరు వచ్చి చేరడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు 35 సంవత్సరాల అనంతరం ఈ పుష్కరిణిలో నీరు రావడంతో పెద్దఎత్తున స్థానికులు, భక్తులు దీనిని తిలకించేందుకు తరలివస్తున్నారు. కాగా ఆలయంలోని మూలబావి, అయ్యప్ప ఆలయం వెనుక, పక్కన గల చెరువులలోకి సైతం పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది.

అధికారుల్లోని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

- అన్ని శాఖల అధికారులు నిద్రాహారాలు మాని పని చేశారు
- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అతిభారీ వర్షానికి వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులకు గురికావడం విచారించదగిన విషయమని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరు ఊహించని స్థాయిలో క్లౌడ్‌బరెస్ట్ అయి వర్షాలు పడి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో కామారెడ్డి పెద్ద చెరువు ఉధృతంగా ప్రవహించిందని తెలిపారు. కామారెడ్డిలో 15 సెం.మీ వర్షం పడుతుందని ఫలితంగా ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని తెలిపారు. పండుగరోజు ప్రజలంతా ఇళ్లలోనే ఉండడంతో ప్రాణనష్టం జరగలేదని, 30 మీటర్లు ఉన్న వాగు ప్రవాహం 300 మీటర్లు పారిందని తెలిపారు. ఒక చెరువు కెపాసిటి నాలుగు చెరువులను నింపేంత ఓవర్‌ఫ్లో అయిందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వరద ప్రవాహం నిమిషాల వ్యవధిలోనే పెరుగుతూ వచ్చిందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు వరదల సమయంలో చెరువుల వద్ద, పంచాయతీ, ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్లపై, మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ నుంచి కానిస్టేబుల్ వరకు, కమిషనర్ నుంచి కార్మికుడి వరకు వరద ప్రభావం తగ్గించే ప్రత్యామ్నాయాలు వెతికారని అన్నారు. అలాంటి అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా కొందరు ఇష్టారీతిన సోషల్ మీడియాలో వైరల్ చేయడం, మరికొందరు మాట్లాడడం సరైంది కాదని అన్నారు. తాను సైతం వరద పరివాహక ప్రాంతాల్లో పనిపైనే దృష్టి సారించారే కానీ ప్రచారంపై కాదని అన్నారు. మానవత్వం ఉన్న ఎవరైన ప్రజలు వరదల్లో చిక్కుకుంటే ఏ విధంగా సాయం చేయాలని ఆలోచన చేస్తారని అన్నారు. జీఆర్ కాలనీ వద్ద 8 ఫీట్ల ఎత్తున డివైడర్‌పై నుంచి వరద ప్రవాహం ఉందని వరద ఉధృతితో డివైడర్‌లు, లైటింగ్ కూలిపోయాయని అంతా అనుకుంటున్నారని కానీ వాటిని తానే కూల్చివేయాలని అధికారులకు సూచించానని తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వాహనం జీఆర్‌కాలనీ వద్ద బోల్తాపడిందని డివైడర్‌లు కూల్చివేయడం ద్వారా రైల్వేట్రాక్, జాతీయ రహదారి దెబ్బ తింటుందని తెలిసి కూడా ప్రజల ప్రాణాల కంటే ఎంత నష్టమైనా ముఖ్యం కాదని భావించనని తెలిపారు. ఇంట్లో కూర్చుని టీవీలు, ఫోన్‌లు చూస్తు సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదన్నారు. మున్సిపల్ సానిటరి ఇన్స్‌పెక్టర్ పర్వేజ్ కష్టాల్లో ఉన్నప్రజలను కాపాడేందుకు రాత్రింబవళ్లు కృషి చేశారని తెలిపారు. ప్రతీ ఒక్క అధికారికి, సిబ్బందికి పేరుపేరునా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఇంట్లో టీవీల ముందు, ఫోన్‌లు పట్టుకుని సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వారికి అది మాత్రమే చేతనవుతుందని తెలిపారు. ఇక బఫర్‌జోన్‌లో, ఆక్రమణలకు గురైన వాటిలో ఎంతటివారైన నోటీసులు ఇచ్చి కూలకొట్టిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ 14 పనులకు టెంపరరీగా 1.79 కోట్లు, శాశ్వత పనులకు రూ.12 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ తాత్కాలిక రోడ్లకు 1 కోటి, శాశ్వత పనులకు రూ.5 కోట్లు, కామారెడ్డి మున్సిపాలిటీలో 30 కోట్ల నిధులు అవసరమని తెలిపారు. ఇక 17,104 ఎకరాలలో పంట నష్టం వాటిల్లగా 11,843 మంది రైతులకు నష్టం చేకూరిందని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి

బాధిత కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం అందించాలి

సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వరదలతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శనివారం జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ, బతుకమ్మకుంట కాలనీల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో మొదటి అంతస్తు వరకు ఇండ్లు నీటమునిగి 24 గంటలపాటు సహాయం కోసం ప్రజలు భిక్కుభిక్కుమంటూ కూర్చోవడం బాధాకరమైన విషయమని తెలిపారు. నిత్యావసర వస్తువులు, విలువైన పత్రాలు కొట్టుకుని పోయి సర్వం కోల్పోయారని తెలిపారు. కనీసం తినడానికి కూడా ఏమీ లేకుండా ప్రజలు ఇబ్బందులు పడడం తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని తెలిపారు. కామారెడ్డిలో ఈ పరిస్థితి రావడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అమ్యామ్యాలకు అలవాటుపడిన అధికారులే నని ఇష్టరీతిన అనుమతులు ఇవ్వడంతో నీరు ఇళ్లలోకి వచ్చి చేరిందన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు చేసిన పాపంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇందులో నాయకులు దేవరాం, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలు 24 గంటలు అందుబాటులో ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్

భిక్కనూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలు ఆగిన అనంతరం వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు 24 గంటలు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, వైద్యులు ఎప్పటికప్పుడు మండలంలో పరిస్థితిని సమీక్షించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభుకిరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గురుకులాలు, హాస్టళ్లలో వైద్య శిబిరాలను నిర్వహించాలని, ప్రజలు వడబోసిన నీరు తాగేలా, వేడి ఆహార పదార్థాలు భుజించేలా, పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కలిపించాలన్నారు. అనంతరం స్థానిక బీసీ హాస్టల్, గురుకుల పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని విద్యార్థులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి యేమిమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న దృశ్యం

అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్/లింగంపేట/తాడ్వాయి/నాగిరెడ్డిపేట/మహమ్మద్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శనివారం వరద ప్రభావిత కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితులు సర్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి అవసరాల నిమిత్తం రూ.11,500లు ఆర్థికసాయాన్ని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖాధికారులతో వరద బాధిత కాలనీల్లో సర్వేచేసి తక్షణమే ఆర్థికసాయాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. వరద బాధిత ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కాగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని గౌలిగూడలో దెబ్బతిన్న ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. బాధితులతో మాట్లాడి అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.4వేల చొప్పున పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. లింగంపేట మండలంలోని లింగంపల్లి వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి రహదారిపై కూలిన పాముల వాగు వంతెన తాత్కాలిక పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ ఈఈ మోహన్‌ను ఆదేశించారు. తాడ్వాయిలో అధిక వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు అధిక వర్షాలతో దెబ్బతిన్న మరియు కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని అన్నారు. నాగిరెడ్డిపేటలోని పోచారం ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతు పనులు చేపడతామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఆయన శనివారం పోచారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లోను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద మట్టి కోతకు గురై గుంత ఏర్పడి కొంత నష్టం జరిగిందన్నారు. దీంతో వెంటనే స్పందించామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో పాటు స్థానిక నాయకుల సహకారంతో ప్రాజెక్టు వద్ద మరమ్మతు పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద తాత్కాలిక మరమమ్మతు పనులు జరుపుతున్నట్టు, వర్షాలు పూర్తిగా తగ్గిపోయాక ప్రాజెక్టు వద్ద శాశ్వత మరమ్మతు పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి శాశ్వత మరమ్మతు పనులు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఏఈ అక్షయ్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, గంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, ఇమామ్, సురేందర్ గౌడ్, శ్రీరామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గు గుడిసె చౌరస్తాలో పూర్తిగా నీటిపాలైన టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, తదితర దుకాణాలు, నిత్యావసర వస్తువులతో సహా పూర్తిగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. నష్టపరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు.


బాన్సువాడలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్


హున్సాలో పొలాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్‌నాయకులు


దోంచందలో పంటలను పరిశీలిస్తున్న సునీల్ కుమార్


వివరాలు తెలుసుకుంటున్న భాస్కర్‌రెడ్డి


పంటలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది : కాంగ్రెస్‌నాయకులు

సాలూర/ఏర్గట్ల/కోటగిరి/రుద్రూరు/నవీపేట/వర్ని/బోధన్ ,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మంజీర నది వరద ముంపు గ్రామాలైన హున్స, మందర్నా, ఖాజాపూర్, హంగర్గ తదితర గ్రామాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితి, నీట మునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న ఇళ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు పూర్తి న్యాయం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఖాజాపూర్ అశోక్, డిస్కో సాయిలు, గాండ్ల రాజేశ్వర్, సొక్కం రవి, శివకాంత్, ప్రశాంత్, శంకర్, కాంగ్రెస్ నాయకులతో పాటు పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్, బోధన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ సాలూర మండల అధ్యక్షులు నర్సయ్య, గ్రామాల తాజా మాజీ బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు. ఏర్గట్ల మండలంలోని గోదావరి పరివాహక గ్రామాల్లో శని వారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ము త్యాల సునీల్ కుమార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్ గ్రామాల్లో వరద తీవ్రత ఎక్కుగా ఉండటంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు త్వరతగతిన నష్టాన్ని అంచానా వేసి ప్రభుత్వానికి నివేధిక పంపాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, బెజ్జారపు భాను కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరిలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి భారీ వర్షాలతో ఉమ్మడి మండలంలో పంట పొలాలు దెబ్బతిని తీవ్ర నష్టం జరిగిందన్నారు. మంజీర నది ప్రాంతం పక్కన ఉన్న పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను సర్వే చేసి ఎకరానికి 30వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఉప తహసీల్దార్ మధుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, రాములు, నాగేష్, లాలయ్య, భీంరావు పాల్గొన్నారు.

రుద్రూరులో భారీ వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం పంట నీట మునిగి పూర్తిగా నష్టపోయిందని ఈ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని భారీ వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 30వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలతో పాటు ఇండ్లు ధ్వంసమై నిరాశ్రయులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాని కోరారు. నష్టపోయిన నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు విఘ్నేష్, ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, మండల కన్వీనర్ నెల్లూరి లక్ష్మణ్, నాయకులు భీమయ్య, అశోక్, భూమయ్య, కిరణ్ రెడ్డి, భూషణం కుమార్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.నవీపేటలో మండలంలోని మిట్టాపూర్, యంచ పంచాయతీ పరిధిలోని అల్జాపూర్ లలోని వరద ప్రాంతాలను శనివారం తహసీల్దార్ వెంకట రమణ, ఏవో నవీన్ కుమార్‌లు పరిశీలించారు. గత మూడు రోజులుగా ఆయా గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. యంచ, నందిగామ మధ్యన ఉన్న రోడ్డుపైకి వరద నీరు రావడంతో ఆయా గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఈవోలు అపూర్వ, వసంత్ తదితరులున్నారు.

● 4,900 ఎకరాలలో పంట నష్టం

మండలంలోని వివిధ గ్రామాలలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సుమారు 4,900 ఎకరాల వరిపంట నీట మునిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో వరిపంట ఎక్కువ భాగంలో నీటమునిగిందని వారు వివరించారు.

వర్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో శనివారం డిసిసిబి జిల్లా మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పర్యటించారు. బడా పహాడ్ పుణ్యక్షేత్రం, సిద్దాపూర్, జలాల్ పూర్ ప్రాంతాల్లో తెగిన రోడ్లు, రహదారుల ధ్వంసంపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గోపాల్, కరీం, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్, అబ్దుల్ భారీ, సిహెచ్ గంగారాం, రాంజ్యానాయక్, కృష్ణా రెడ్డి, ఎస్సై మహేష్ తదితరులు ఉన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బోధన్ ఉమ్మడి మండలం జల దిగ్బంధంలో ఉన్న గ్రామాలకు వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది.ఖాజాపూర్, హున్స గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. హంగర్గ గ్రామంలో వరద నీరు తగ్గుముఖం పట్టింది. పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు మెల్లమెల్లగా తగ్గుతుంది. ఆదివారం వరకు పూర్తిస్థాయి పంట పొలాల్లో ఉన్న నీరు వెళ్లిపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నష్టపోయిన పంటలను అంచన వేయవచ్చన్నారు. రెండు, మూడు రోజులుగా వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు తమ ఇళ్లలోకి చేరుకున్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మానాల

ఏర్గట్ల,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):మండ లంలోని పలుకుటుంబాలను శనివారంరాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మో హన్ రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రా నికి చెందిన సున్నపు ఇస్తారి, పిలేట్ల వెంక టేష్, రేండ్ల మారుతి, చూపూరి భూమేశ్వర్, మేడారపు ముత్యం కుటుంబ సభ్యులను అ లాగే రోడ్డు ప్రమాదంలో గాయాలైన నవ తెలంగాణ రిపోర్టర్ ఎట్టె అనిల్ యాదవ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, రేండ్ల రమేష్, రొక్కొడ సంజీవ్, మునీర్, అంజయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ


పార్టీ నాయకులతో ఎంపీడీవో సమావేశం

డొంకేశ్వర్/కోటగిరి,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) :డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో రాజకీయ పార్టీ నాయకు లతో ఓటరు జాబితాలపై సమావేశాన్ని నిర్వ హించారు. గురువారం 13 గ్రామ పంచాయతీలో కార్యదర్శులు ఓటరు జాబితాను పంచాయతీల్లో ప్రదర్శించారు. ఓటరు జాబితాపై నాయకుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో మొత్తం 16,760 ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 9,064, మంది కాగా పురుష ఓటర్లు 7,696 మంది అత్యధికంగా నూత్‌పల్లి పంచాయతీలో 2,279 ఓటర్లు అత్యల్పంగా గాదెపల్లి పంచాయతీలు 453 మంది ఓటర్లు ఉన్నారు.పోలింగ్ బూత్‌లలో ఏ ఒక్కటి కూడా మార్పు జరగలేదని తెలిపారు.

కోటగిరి, పోతంగల్ మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటర్ లిస్ట్‌ల సవరణపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాస్ రెడ్డి, చందర్, నాయకులు విఠల్ గౌడ్, పవన్, గంగాధర్, ఏజాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బస్సులో నుంచి పడి మహిళకు గాయాలు


గాయాలైన చంద్రకళ

లింగంపేట,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):లింగంపేట మండలంలోని ముస్తాపూర్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సులో నుంచి పడి మండల కేంద్రానికి చెందిన కొట్టూరి చంద్రకళ కామారెడ్డికి వెళ్లేందుకు బస్సు ఎక్కగా ముస్తాపూర్ గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడిపో యినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో చంద్రకళకు ముఖంపై గాయాలు కావడంతో ఆమెను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మందర్నా శివారులో నెమలి మృత్యువాత


నెమలి కళేబరం

సాలూర,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):సాలూర మండలంమందర్నా గ్రామ శివారులో రోడ్డుపై జాతీయ పక్షి నెమలి మృతి చెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. అటుగా వెళ్తున్న గ్రామస్థులు రోడ్డుపై ఉన్న నెమలిని గమనించారు. అప్పటికే నెమలి మృతి చెంది ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. హున్స, మందర్నా., ఖాజాపూర్ వరద ఉధృతి వలన ముంపునకు గురైన విషయం అందరికి తెలిసిందే. వరద తాకిడి నెమలి మృతి చెంది నీటిలో కొట్టుకువచ్చినట్లు ఈ సందర్భంగా గ్రామస్థులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బీర్కూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని కాలా బజార్ కాలనీలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఈ ఘటనలో ఆరుగురు పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.వారి వద్ద నుంచి రూ.3,080నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ శేఖర్ తెలిపారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన జిల్లా ఉద్యాన అధికారి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఉద్యాన జిల్లా అధికారి

ఏర్గట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామంలో ఎస్సారెస్పీ ద్వారా వచ్చిన నీటితో దెబ్బతిన్న పంటలను శనివారం జిల్లా ఉద్యాన అధికారి బండారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి మునిగిన పసుపు, మొక్క జొన్న పంటల వివరాలను ప్రాథమిక అంచానాలను ప్రభుత్వానికి సమర్పించామని, వరద నీరు పూర్తిగా తొలగిపోయిన వెంటనే ఎకరాకు 50 కిలోల వేప పిండిని వెదజల్లుకొని మెటల్క్సిన్ అలాగే మాన్కోజేబ్ మందును లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలుపుకొని మొదలు బాగా తడిచేలా పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, తాళ్లరాంపూర్ సొసైటీ చైర్మన్ తహసీల్ధార్ మల్లయ్య, ఏవో వైష్ణవ్, రైతులు పాల్గొన్నారు.

ఉప్పర్‌పల్లిలో ఒకరి మృతి

దోమకొండ,(బీబీపేట) ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో ఒకరు మృతి చెందారు. బీబీపేట ఎస్సై ప్రభాకర్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా బీబీపేట పెద్ద చెరువుకు గండి పడటంతో శనివారం గండిని పూడ్చేందుకు ట్రాక్టర్‌లో మొరం తీసుకురావడానికి వస్తున్న క్రమంలో మన్నే రమేష్ (45)కు ట్రాక్టర్‌స్టీరింగ్ చాతీలోతగిలి గాయపడగా అదేపనుల్లో ఉన్న వ్యక్తులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు.కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. గత మూడు రోజులుగా చెరువు గండిని పూడ్చే పనుల్లోఉన్న రమేష్‌మృతి చెందడంతో ఉప్పర్ పల్లి, బీబీపేట గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉజ్వల హైస్కూల్‌లో మాక్ ఎలక్షన్

నందిపేట, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో శనివారం ఉజ్వల హైస్కూల్ ఆధ్వర్యంలో మాక్ ఏలక్షన్ నిర్వహించారు. హెడ్ బాయ్, గర్ల్ బాయ్, స్పోర్ట్ కెప్టెన్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరైన మండల తహసీల్దార్ సంతోష్, ఎంఈవో అవదూత గంగా .దర్‌లు హెడ్ బాయ్‌గా దాసరి రాజేష్ (9వ), హెడ్ గర్ల్ గొల్ల రిషిత రాజ్ (9వ), స్పోర్ట్ కెప్టెన్ అందే వనీం ద్రల ను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉజ్వల హైస్కూల్ కరస్పాండెంట్ గోజూరి అరుణ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి స్పెషల్ ప్యాకేజ్ నిధులు ఇవ్వాలి

● సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే


సీఎంకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డి నియోజక వర్గానికి స్పెషల్ ప్యాకేజీ నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డినిఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు.అసెంబ్లీ సమావే శాలు ప్రారంభమైన సంద ర్భంగా శనివారం సీఎంతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూఎల్లారెడ్డి నియోజక వర్గాన్ని భారీవ ర్షాలు, వరదలు కుదిపేశాయని వివరించారు. వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారన్నారు. రోడ్లు, వంతెనలు, చెరువులు ధ్వంసమయ్యాయని, వాటి పునర్నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయా లని సీఎంను విజ్ఞప్తి చేశారు. వరదకు తట్టుకొని నిలబడ్డ పోచారం ప్రాజెక్టు 103 ఏళ్ల చరిత్ర కలిగిన పోచారం ప్రాజెక్టు భారీ వరదను సైతం తట్టుకొని నిలబడిందని, అయితే అక్కడక్కడా గుంతలు పడ్డ సందర్భంగా మరమ్మతుల నిమిత్తం నిధులు మం జూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే కోరారు.

కన్నాపూర్‌కి స్పెషల్ ప్యాకేజీ ప్రభుత్వం ప్రకటించాలి


చౌదరీ చెరువును పరిశీలిస్తున్న టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

లింగంపేట, అగస్ట్ 30 (ఆంధ్రజ్యోతి) : కన్నాపూర్ గ్రామానికి స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ అన్నారు. ఆయన శనివారం కన్నాపూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల బాధలను తెలుసుకుని వారికి సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నాపూర్ గ్రామానికి 500ఎకరాలకు నీటిని అందించే చౌదరీ చెరువుకు గండి పడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, గ్రామంలో 15నివాసపు గృహాలు కూలిపోయాయని, గ్రామానికి రావడానికి ఉన్న బ్రిడ్జీ కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని దీంతో గ్రామస్తులు అన్నమో రామచంద్ర అంటు ఆకలితో సహాయం కోసం ఎదురు చూస్తున్నారని గ్రామాన్ని వెంటనే అధికారులు సందర్శించి వారికి సహాయక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ


వస్తువులను అందజేస్తున్న దృశ్యం

ధర్పల్లి,ఆగ స్టు30 (ఆంధ్రజ్యోతి):మం డలంలోని ముంపు కు గురైన వాడి గ్రామంలో శనివారం నిత్యావసర వస్తు వులు అధికారులు పంపిణీ చేశారు.ముంపు బాధి తులను ఇప్పటికే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూ పతిరెడ్డి సందర్శించారని అన్ని విధాల ప్రభుత్వం నుంచి రావా ల్సిన ఆర్థిక సహాయం అందజేసే విధంగా చూస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, చెలిమెల శ్రీనివాస్, తహశీల్దార్ శాంత, ఏపీడీవో, ఆర్ఐ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలి

● మాజీ ఎమ్మెల్యే షకీల్


షకీల్ ఫోన్‌లో మాట్లాడుతున్న(ఫైల్)

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బోధన్ నియోజకవర్గం అతలకుతలం అయిందని, వరద ప్రభావిత ప్రాంతాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టాలని బోధన్ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. శనివారం బోధన్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ మండల నాయకులతో దుబాయ్ నుంచి ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా జన జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటికి క్షేమంగా చేరిన లింగంపల్లి కలాన్ విద్యార్థులు


విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రెవెన్యూ అధికారులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామానికి చెందిన 8 మంది విద్యార్థులు క్షేమంగా శనివారం తమ తమ ఇంటికి చేరుకున్నారు. ఈ గ్రామానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు బుధవారం వినాయక చవితి పండుగ రోజున గణేష్ విగ్రహం కొనుగోలు చేసేందుకు మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్‌కు వెళ్లారు. పోచారం ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి వల్ల పోచారం గ్రామం వద్ద గల ప్రధాన రహదారి తెగిపోవడంతో ఈ విద్యార్థులు తిరిగి ఇంటికి రాలేక పోచమ్మరాల్ గ్రామంలో ఉండిపోయారు. శుక్రవారం పోచారం ప్రాజెక్టు వరద కాస్త తగ్గడంతో వారిని ఆర్మీ రెస్క్యూ టీం బృందం కామారెడ్డి జిల్లా వైపు విద్యార్థులను తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో విద్యార్థులను శనివారం మెదక్ జిల్లా అధికారులు ప్రత్యేక వాహనంలో మెదక్ జిల్లా నుంచి నిజాంసాగర్ మీదుగా నాగిరెడ్డి పేటకు తీసుకొచ్చి స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో వారి వారి తల్లిదండ్రులకు విద్యార్థులను అప్పగించారు. దీంతో విద్యార్థులు క్షేమంగా ఇంటికి చేరుకున్నారు.

పాల్వంచ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు ప్రారంభం


రాకపోకలు సాగుతున్న దృశ్యం

పాల్వంచ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వరదలతో పాల్వంచ వాగు బ్రిడ్జికి ఇరువైపులగల మట్టి కొట్టుకుపోవడంతో గత మూడు రోజులుగా నిలిచిన వాహనాల రాకపోకలుశనివారంప్రారంభంఅయ్యాయి. వాహనాల రవాణా నిలిచిపోవడం వలన మాచారెడ్డి వైపుకు వెళ్లడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. అధికారులు బ్రిడ్జి మరమత్తు పనులను ఉదయం ప్రారం భించి సాయంత్రానికి పూర్తి చేసి వాహనాలను అనుమతించారు.

గణేష్ నిమజ్జన పసుపు వాగును పరిశీలించిన సబ్‌కలెక్టర్

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన ప్రదేశం అయిన పసుపు వాగును బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పసుపు వాగు బ్రిడ్జి కిందకు నీరు భారీగా వెళ్లడంతో పరిసరాలను పరిశీలించారు. గణేష్ నిమజ్జనంకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ యోగేష్, సంబంధిత శాఖ అధికారులున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాలపడితే షీటీంకు సమాచారం ఇవ్వాలి

ఆర్మూర్, ఆగస్టు 30: (ఆంధ్రజ్యోతి) విద్యార్థినిలు, మహిళలు ఇవ్‌టీజింగ్‌కు, వేదింపులకు గురౌతె భయపడకుండా పిర్యాదు చేయాలని, పోలీసలు, షీటీం సభ్యులు విద్యార్థినిలకు సూచించారు. శనివారం ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు షీటీంసభ్యులు అవగాహన కల్పించారు. ఎవరైన ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే షీటిం నెంబర్ 8712659795, డైల్ 100 కు సమాచారం ఆవ్వాలన్నారు. అదేవిదంగా క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే విదానాన్ని విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పారావు, హెచ్‌సీ అనంతరావు, షీటీం సభ్యులు విజ్లేష్, సుమతి, హెచ్‌ఎం నరేందర్, పుష్ప, పీఆర్టీయు నాయకులు ఆశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కల్దుర్కి పంట పొలాల్లో పాములు

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలోని పంట పొలాల్లో వందల కొద్ది పాములు బయటపడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీటికి పాములు కొట్టుకువచ్చాయని ఈ సందర్భంగా గ్రామస్థులు తెలిపారు. నీట మునిగిన పంట పొలాలను చూడడానికి వెళ్లిన రైతులకు ఒక్కసారిగా పాములు కనిపించడంతో భయాందోళనకుగురయ్యారు. తీరా చూస్తే పాములు కుప్పలు కుప్పలు చనిపోయి పడి ఉన్నాయని తెలిపారు.

108లో ప్రసవం

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామానికి చెందిన మేకల చంద్రకళను మూడవ కాన్పు నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా లంగ్డాపూర్ బ్రిడ్జి వద్దకు రాగానే నొప్పులు అధికమవ్వడంతో 108 సిబ్బంది అంబులెన్స్‌ను నిలిపి ఉన్నతాధికారుల సూచనలతో సుఖ ప్రసవం చేశారు. దీంతో చంద్రకళ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో తల్లీబిడ్డలకు క్షేమంగా బోధన్ ఆసుపత్రికి తరలించారు. సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బంది లక్ష్మణ్, కేశవ్ కుమార్ లను వైద్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వివేకానంద విగ్రహం ఏర్పాటు కోసం భూమిపూజ

ఏర్గట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామంలోని యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు కోసం గ్రామంలోని యువజన సంఘాలు, విడిసీ సభ్యులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువజన సంఘాల సభ్యులు, విడిసి సభ్యులు, పాఠశాలలోని సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

కోటగిరి,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీ, బ్రాహ్మణ గల్లీతో పాటు పలు కాలనీల్లో పాత ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులువల్లేపల్లి శ్రీనివాస్ రావు, కిషన్, రవి, గజేందర్, సమీర్, శంకర్ గౌడ్, సంతోష్, నజీర్,మహేష్‌రెడ్డి,నవీన్,యోగేష్,సందీప్ ఉన్నారు.

పిచ్చి కుక్కల నివారణకు నియంత్రణ చర్యలు

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో రోజురోజుకు పిచ్చి కుక్కల బెడద అధికమవ్వడంతో కుక్కల నివారణకు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, డీఈ యోగేష్, శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ గణేష్‌లతో యానిమల్ బర్త్ కంట్రోల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాల ద్వారా బోధన

ఆర్మూర్, ఆగస్టు 30: (ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడి కేంద్రలలో పిల్లలకు ఆట పాటల ద్వార బోధన సాగించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి అన్నారు. ఆర్మూర్ మున్సిపాల్ పరిధి మామిడిపెల్లిలో శనివారం అంగన్‌వాడి సెంటర్‌లో చిన్నారులకు ఆటపాటలకు సంభందించిన పరికరాలను ప్రదర్శించారు. ఆట వస్తూలద్వార, ఆటపా టలద్వార విద్యబోదన సాగిస్తే పిల్లలు అర్థంచుసుకునే వీలు కలుగు తుందన్నారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ సంగీత,ఆశావర్కర్‌లు పిల్లలతల్లిందండ్రులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలలో వైద్య శిబిరం

సాలూర,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు గ్రామాలైన ఖండ్‌గావ్, మందర్నా, ఖాజాపూర్, హంగర్గ, హున్స తదితర గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కావాల్సిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా సాలూర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ ప్రజల ఆరోగ్య జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు. వర్షాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రజలకు ఎలాంటి వ్యాధులు సోకుండా మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిరా, గంగామణి, ఆశవర్కర్లు గోదావరి, అనురాధ, లక్ష్మిబాయి, సుధమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వివరాలను ప్రతీరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

బోధన్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వివరాలను ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శనివారం బోధన్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందించిన యూనిఫామ్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి రోజు విద్యార్థుల హజరు, ఫేషియల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆరీఫోద్దీన్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, అన్నాగ్రేస్, భూమయ్య, సీఆర్‌పీలు విజయ్, రేఖ, విజయ, యుసుఫ్, బాబు, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


జాన్కంపేట్ పరామర్శిస్తున్నఎమ్మెల్యే

వేల్పూర్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పలుగ్రామాలలో బాధిత కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పడిగెల గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యకుడు మారు పెద్ద తిరుపతి మాతృమూర్తి, పచ్చల నడికుడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పున్నంరెడ్డి తండ్రిఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బాదిత కుటుంబాలను పరామర్శించి ప్రగా ఢ సానుభూతిని తెలియజేశారు.జాన్కంపేట్ గ్రామమాజీ సర్పంచ్ సౌడ రమేష్ తండ్రి కిషన్ అనారోగ్యంతో బాదపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

గొర్రెల చోరీ నిందితులను పోలీసులకు అప్పగింత

జక్రాన్‌పల్లి,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన గంగాదర్ యాదవ్‌కు చెందిన గొర్రెలను చోరీ చేస్తున్న నిందితులను పట్టుకొని పోలీసులకు గ్రామస్తులు అప్పగించారు.మహారాష్ట్రకుచెందిన అర్జున్, సురేష్, అజయ్ కారులో వచ్చి 4 గొర్రెలను చోరీ చేసి కారులో వేసుకొని వెళ్తుండగా కేశ్‌పల్లి గ్రామస్తులు పట్టుకున్నారు. నిందితులు అంకాపూర్‌లో ఉంటున్నారని గ్రామస్తులు తెలిపారు. వీరిలో నిందితుడు అర్జున్‌ను అదుపులోకి తీసుకున్నా మని, సురేష్, అజయ్ పరారీలో ఉన్నట్లు ఎస్సై ఎండీ మాలిక్ రహమాన్ తెలిపారు.

సర్పెల్లి చెరువుకు గండి

▸ పూడ్చిన ఆయకట్టు రైతులు


గండిపడిన సర్పెల్లి చెరువు

సిరికొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సర్పెల్లి చెరువుకు గండి పడి నీల్లు బటికి వెళ్తున్నందున రైతులు స్పందించి తల కొంత మొత్తాన్ని జమా చేసుకుని గండిని పూడ్చి నీటీని అదిమి పట్టారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సర్పెల్లి చెరువుకు గండి పడ్డది. వర్షపు నీల్లు పొలాలను ముంచెత్తాయి. సాగు చేసిన వరి పంటను కాపాడుకోవడంతో పాటు చెరువులోని నీటీని కూడ కాపాడుకోవాలనే సదుద్దేశ్యంతో రైతులే గండిని పూడ్చుకోవడానికి కదిలారు. నీటి పారుదల శాఖ అధికారులు రావాలి, గండిని పూడ్చాలంటే ఉన్న నీళ్ల బయటికి వెల్తాయని బావించిన ఆయకట్టు రైతులు కదిలి డబ్బులు జమా చేసుకుని శనివారం గండిని పూ డ్చారు. ట్రాక్టర్లతో మట్టిని తీసుకొచ్చి గండిని పూడ్చి చెరువులోని నీళ్లను బయటికి వెళ్లకుండా కాపాడుకుని అందరికి ఆదర్శంగా నిలిచారు.

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయించిన కాంగ్రెస్ నాయకులు


రోడ్డును బాగు చేయిస్తున్న నాయకులు

సిరికొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీ వల రెండు రోజుల పాటు కురిసిన బారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను కాంగ్రెస్ నాయకులు స్పందించి బాగు చేయించా రు. సిరికొండ మండలంలోని గోప్య తండా నుంచి గంట్యా తండా రోడ్డు, కొండపూర్ నుంచి గడ్డ మీది తండాకు వెళ్లే రోడ్డుపై గల రెండు వంతెనల వద్ద మట్టి రోడ్డు కోతకు గురయ్యి వాహనాలు కాదుకదా మనుషులు కూడా నడవలేని పరిస్థితి ఏర్పడింది. శాసన సభ్యుడు డాక్టర్ భూపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి సూచనలతో కోతకు గురైన వంతెనల వద్ద మట్టిని నింపి బాగు చేయించారు. ట్రాక్టర్లు, జెసీబీలతో మొరాన్ని తీసుకొచ్చి రోడ్లను బాగు చేయించారు. మొ త్తం రోడ్లయితే బాగయ్యాయి. వాహనాల రవాణ సాఫీగా జరిగేల చేశారు. బీమ్‌గల్ వెళ్లె మార్గంలో ఒక చోట కల్వర్టు వద్ద మొరం పోయించి బాగు చేయించారు.రోడ్లను బాగు చేయించే కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భుచ్చన్న,శ్రీదర్,కిషోర్‌గౌడ్,ఆకుల జగన్,జీవన్‌నాయక్,భూక్య సంతోష్, మంగ్యానాయక్,భూక్య లాలు, రాంసింగ్ నాయక్‌చిన్న పులి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తిని సందర్శించిన సబ్ కలెక్టర్

● ఎస్‌బీఆర్‌ఎఫ్ బృందాలతో గోవులకు దాణా అందజేత


ఆశ్రమానికి బయల్దేరుతున్న ఎస్‌బీఆర్‌ఎఫ్ బృందాలు

రెంజల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు రోజుల నుండి గోదావరికి వరద ఉధృతి అధికమవ్వడంతో శనివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో స్థానిక తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. వరద నీరు గ్రామం వరకు చేరడంతో పరిస్థితులను పరిశీలించారు. సీతారాం త్యాగి ఆశ్రమంలో 16గోవులను రెండవ అంతస్తులో ఉంచడంతో వాటికి ఆహారం, నీరు అందించేందుకు ఎస్‌బీఆర్‌ఎఫ్ బృందాలను కందకుర్తికి రప్పించి ఎస్‌బీఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో గోవులకు దాణా, మంచినీటిని అందజేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎస్‌ఐ చంద్రమోహన్‌లు గ్రామ పరిస్థితులను పర్యవేక్షించారు. గోదావరి పరివాహక ప్రాంతమైన కందకుర్తి గ్రామంలోని వరద నీరు రావడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. అధికారుల పర్యవేక్షణలో గోవులకు ఆహారం, నీరును అందజేసి గోవులు సురక్షితమైన ప్రదేశంలో ఉన్నాయని ఎస్‌బీఆర్‌ఎఫ్ బృందాలు వెల్లడించారు. గ్రామస్థులు ఎవరు కూడా నీటి ఉధృతి తగ్గేంత వరకు ఆశ్రమం వైపు రాకూడదని సూచించారు.


ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నిమజ్జనంలో ఏమరుపాటు వద్దు

▸ ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద స్థలాన్ని పరిశీలించిన సీపీ సాయి చైతన్య


ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య

నందిపేట, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని సీపీ సాయి చైతన్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జిపై నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ విగ్రహల నిమజ్జన సమయంలో లైటింగ్ ఏర్పాటు చేసి క్రేన్లను అందుబాటులో ఉంచాలని అంతేకాకుండా వైద్య సదుపాయాలను కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, భద్రత ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. డీజేలను అనుమతించకూడదని, పోలీస్ సిబ్బంది క్రమ శిక్షణతో మెలగాలని అందుకు ప్రజలు కూడా సహకరించాలని సీపీ సాయి కోరారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలను ఘనంగా జరుపుకొనుటకు ప్రతీఒక్కరు సహకరించాలని సీపీ సాయి చైతన్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ శ్యామ్ రాజ్, సిబ్బంది ఉన్నారు.

జుక్కల్‌లో సీజనల్ వ్యాధులు

▸ రోగులను దోచుకుంటున్న పీఎంపీలు

జుక్కల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురవడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడ్డారు. ప్రైవేట్ పీఎంపీ వైద్యులు క్లినిక్‌కు వచ్చిన రోగులకు వచ్చిరాని అనుభవం లేని వైద్యం చేసి రోగుల వద్ద డబ్బులు దోచుకుంటున్నారు. వైరల్ ఫీవర్ సోకిన రోగికి ఒక సెలెన్ బాటిల్ అధిక డోస్ మందులు ఇస్తున్నారు. రోగుల వద్ద ఓపి పేరుతో ఫీజులు తీసుకొని మెడికల్ వారితో ఆర్ఎంపీ వైద్యులు డిస్కౌంట్ ఒప్పందం చేసుకొని అధికంగా పై మందులు రాస్తూ మెడికల్‌లో కొనుగోలు చే యిస్తు న్నారు. సిరప్, మందులపై మార్జిన్ ఎక్కువగా ఉండడంతో ప్రతీ రోగికి సిరప్ లు, మందు బిల్లలు టాబ్లెట్స్ రాస్తున్నారు. జ్వరం వచ్చిన వారు మెడికల్ నుంచి కొనుగోలు చేసి పీఎంపి వైద్యుని సంప్రదిస్తున్నారు. పీఎంపి వైద్యు లు వచ్చిరాని వైద్యం చేస్తూ రోగుల వద్ద అధిక డబ్బులు తీసుకుంటున్నారని బహిరంగంగా చెప్పుకున్నారు. ఇతర మండలాల నుంచి పీఎంపీలు జుక్కల్ మండలానికి వలస వచ్చి క్లినిక్ పెట్టుకొని వచ్చిరాని వైద్యం చేస్తూ డబ్బుల దోపిడీకి తెర లేపినట్లు మండల ప్రజలు పేర్కొన్నారు.


డోంగ్లి మండలంలో లింబూర్ హసన్ టాక్లీ పెద్ద తెగిపోయిన రోడ్డు


సిర్పూర్ - పోతంగల్ మధ్య వరదలకు తెగిన రోడ్డు


రాచూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు వరదలకు కొట్టుకుపోయిన రోడ్డు

తెగిన రోడ్లు.. నిలిచిపోయిన రాకపోకలు

మద్నూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఆయా గ్రామాల్లోకి వరద నీరు రావడంతో పాటు రోడ్లన్నీ తెగిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మద్నూర్ మండలం రాచూర్ రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలనే నిధులు కేటాయించింది. వర్షాకాలం దృష్ట్యా పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఉన్న రోడ్డు సైతం వరద నీటికి కొట్టుకుపోయింది. అదేవిధంగా డోంగ్లి మండలంలోని సిర్పూర్ పోతంగల్ మధ్య రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు స్తంబించాయి. లింబూర్ హసన్ టాక్లి మధ్య రోడ్డు వరద నీటికి కొట్టుకుపోగా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. హసన్ టాక్లి , పెద్ద టాక్లి, సిర్పూర్ మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో ఒకవైపు రోడ్లు మరోవైపు పంట నష్టపోయి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి పెద్ద టాక్లి, సిర్పూర్, తడి హిప్పర్గా, లింబూర్ గ్రామస్తులు మద్నూర్, డోంగ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనీ సహాయ కేంద్రాలలోనే ఉంటున్నారు. వారికి స్వచ్ఛంద సంస్థలు వారు ముందుకు వచ్చి భోజన, టిఫిన్ ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులు దగ్గరుండి వారికి కావాల్సిన సౌకర్యాలను సమకూరుస్తున్నారు. కాగా రోడ్ల మరమ్మత్తు జరిగేదెప్పుడు? తమ గ్రామాలకు మేము వెళ్లేది ఎప్పుడు? అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామాలకు యుద్ధ ప్రతిపాదికన రోడ్ల మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఏడాదికి ఐదు నెలలు నీటిలోనే..


నీటిలో మునిగిన ఉమా మహేశ్వర ఆలయం

నందిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మెడ గ్రామ శివారులో ఉన్న ఉమా మహేశ్వర ఆలయం ప్రతీ సంవత్సరం నీటిలోనే మునిగి ఉంటోంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండి, నీరుపైకి రావడంతో గోదావరి నది ఒడ్డున ఉన్న ఈ ఉమా మహేశ్వర ఆలయం ఏడాదికి నాలుగు నుంచి ఐదు నెలల పాటు నీటిలోనే మునిగి ఉంటుంది. దీంతో గోదావరి నది నీటి ప్రవహనికి ఆలయంలో మట్టి వచ్చి చేరుతోంది. నీటి ప్రవాహం తగ్గి శిఖరాలు తేలడంతో ప్రతీ సంవత్సరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు స్పందించి మట్టిని తోడేస్తుంటారు. అయితే ఈ ఆలయాన్ని మొదటగా దర్శించేది జాలరులే. ఎందుకంటే ఆలయం పక్కనే ప్రతీ రోజు చేపలు పడుతుంటారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- మాదస్తు శేఖర్, నందిపేట



గోదావరి తీరంలో ఉన్న ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఆవకాశాలు ఉన్న ఆ దిశగా ప్రభుత్వాలు వేగంగా దృష్టిసారించడం లేదు. చారిత్రాక ప్రసిద్ది కలిగిన ఈ ఆలయం జిల్లా కేంద్రానికిసుమారు 36 కిలో మీటర్ల దూరంలో, నందిపేటకు 8 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ ఆల యం దగ్గరకు వెళ్లడానికి డబుల్ రోడ్డు నిర్మించారు. గోదావరి నదిపై నిర్మల్, నిజామాబాద్ జిల్లాలను కలుపుతూ పంచగుడి - ఉమ్మెడ శివారు మధ్యలో రూ.210 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు.

పురావస్తు శాఖ చొరవ చూపాలి

-గడ్డం విక్రంసింహ రెడ్డి, నందిపేట



ఏటా నీటిలో మునిగి ప్రహరీ చుట్టూ మట్టి పేరుకుపోయి ఈ ఉమామహేశ్వర ఆలయం క్రమంగా భూగర్భంలో కలిసిపోతోంది. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు స్పందించి చారిత్రాత్మక ప్రాధాన్యం గల ఈ ఆలయాన్ని పరిరక్షించాల్సిన అవసం ఎంతైనా ఉంది.


కమ్మర్‌పల్లి- ఉప్లూర్ మధ్యలో కోతకు గురైన రహదారి


నందిపేట-శాపూర్ మెయిన్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

జర పట్టించుకోండి

▸ ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు శూన్యం

కమ్మర్‌పల్లి/ నందిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి నుంచి ఉప్లూర్ గ్రామానికి వెళ్లే రహదారిలో వరద కాల్వ కల్వర్టు గుంతవద్ద నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో భారీ వర్షాలకు కల్వర్‌వద్ద గండి పడగా పూర్తి స్థాయి మరమ్మతులు చేయడంలేదు.

నందిపేట నుంచి నిజామాబాద్ వెళ్లే రహదారి మార్గంలో పలు గుట్టకు సమీపంలో, విజయ్ నగర్‌కు అటూ ఇటూ తారు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడాయి. రైతు ఫారం-వెల్మల్ చైరస్తా మధ్యలో, అంధ్రనగర్ మాక్లూ మండలం మెట్టు శివారు మధ్యలో గుంతలు పడ్డాయి. నందిపేట-శాపూర్, వివేకానంద చౌరస్తా నుంచి పాతూర్ మధ్యలో కొత్త బైపాస్ రోడ్డుపై గుంతలు ఏర్ప డ్డాయి. నందిపేట-శాపూర్ మధ్యలో చిలుకల చిన్నమ్మ ఆలయం సమీపంలో తారు రోడ్డు మట్టి రోడ్డును తలపిస్తోంది.

మారుమూల తండాల
రహదారులు బాగు చేయించండి సారూ


కంకర తేలిన పెద్దదేవిసింగ్ తండా రహదారి

పెద్ద కొడప్‌గల్, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల కిందట మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదార్లను బాగు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని మారూమూల తాండాలైన పెద్ద దేవిసింగ్ తాండ, మన్సూరాం తాండాలకు వెల్లే రహదార్లు భారీ వర్షాలకు దెబ్బతిని ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయని వాపోతున్నారు. వడ్లం గ్రామం నుండి పెద్ద దేవిసింగ్ తాండ వరకు 3.5 కిలోమీటర్ల దూరం ఉండగా భారీ వర్షాలకు రహదారిపై ఉన్న మట్టి కొట్టుకుపోయి కంకర తేలిందని, ఇంక కొన్ని చోట్ల గుంతలు పడి నీరు నిలువడంతో వాహనాలు గుంతల్లో పడి చెడిపోతున్నాయని, అంతేగాక గుంతలలో వాహనాలు పడటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక సముందర్ తాండ పరిధిలో గల మన్సూరాం తాండ రహదారి భారీ వానలకు వరదలు రాగా రహదారి కోతకు గురై మూడు, నాలుగు చక్రాల వాహనాలు నడవడానికి వీలులేని స్థితిలో ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో, రాత్రి సమయాలలో ఈ రహదార్లపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి మారుమూల తండాల రహదార్లపై దృష్టి సారించి మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వరదలు తగ్గుముఖం పట్టాలని పూజలు


గంగమ్మకు తెప్పలు వదులుతున్న తాడ్‌బిలోలి గ్రామస్థులు


భజనలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

రెంజల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి తాడ్‌బిలోలి గ్రామాన్ని వరద నీరు ముంచెత్తడంతో గ్రామ పొలిమేర వరకు నీరు చేరడంతో గ్రామంలో ఉన్న పంట పొలా లు పూర్తిగా నీట మునిగి తీవ్ర నష్టాన్ని మిలిల్చాయని తాడ్‌బిలోలి గ్రామస్థులు వరద నీరు తగ్గాలని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి తెప్పలను వదిలారు. గ్రామంలోని హనుమాన్ మందిరం నుండి గ్రామస్థులు భజనలతో తరలివెళ్లారు. వరద ఉధృతి తగ్గాలని గంగమ్మకు తెప్పలు వదిలారు. గంగమ్మ కరుణించి వరదలు తగ్గి నీట మునిగిన పంటలు కాపాడాలని మొక్కులు చెల్లించారు. గత 42ఏళ్ల క్రితం వచ్చిన వరద మళ్లీ ఈ ఏడు వచ్చిందని వరద వల్ల గ్రామంలోని 5వేల ఎకరాలు పంట పూర్తిగా నీట మునిగిపోవడంతో గ్రామస్థులందరు తీవ్ర నష్టాన్ని చవిచూశారని, గంగమ్మ కరుణించి వరద ఉధృతిని తగ్గించాలని తెప్పలు వదిలారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ పంతులు, రామాలయ చైర్మన్ గొసుల శ్రీనివాస్, యోగేష్ పటేల్, నర్సయ్య, జగన్ రెడ్డి, అబ్బన్న, సాయిరెడ్డి, దత్తు పటేల్, లక్ష్మణ్, మల్ల సాయిలు, గంగాధర్, ప్రసాద్, సురేష్ పటేల్, రమేష్, పెద్దులు, ప్రభాకర్, సాయిలు, మహిపాల్, రాజేష్, రూపేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులతో వరద గురించి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యేలు

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల విస్తృత పర్యటన

● వరద బాధితులకు, రైతులకు భరోసా కల్పిస్తున్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజుల సురేందర్

నిజాంసాగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జుక్కల్ నియోజకవర్గం లో పలు గ్రామాలు వరద నీటితో ముంపునకు గురయ్యాయి. దానితో పాటు కొన్ని గ్రామాల్లో వరద నీటిలో మునిగి పూర్తిగా పంటలు నష్టమయ్యాయి. ఈ విష యంపై శనివారం మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే వరద బాధితులను సందర్శించి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగిన రైతులకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులకు కొన్ని సూచనలు, సలహా లు ఇచ్చారు. వీరితో పాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజుల సురేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొన్నారు.

ఊరికి ఉపకారి అర్వింద్

▸ వరద బాధితులకు అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా నిత్యవసర సరుకుల అందజేత


సరుకులు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

సుభాష్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వరద బాధితులకు అండగా నిలిచి వరద బాధితులకు నిత్యవసర సరుకులు అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేశారు. నిజామాబాద్ జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో వర్షాలు, వరదల కారణంగా తీవ్ర నష్టం జరిగిం ది. నిరాశ్రయులైన ప్రజలకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ తన ఫౌండేషన్ ద్వారా నిత్యవసర కిట్‌లను అందజేశారు. వర్షాలు, వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 500 నిత్యవసర కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండలాల అధ్యక్షులు, పార్టీ కా ర్యకర్తల చేతుల మీదుగా నిరాశ్రయులైన ప్రజలకు నిత్యవసర కిట్‌లను అం దజేశారు. కష్టకాలంలో అండగా నలిచిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

సంధ్యా సమయంలో బింబం ప్రతిబంబమైన వేళ


నీటిలో ఏర్పడిన వృక్షం ప్రతిబింబం

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లో గల చెరువులు, కుంటలు నీటితో నిండు కుండగా మారాయి. వారం రోజుల కిందటి వరకు సగం సగం నిండిన చెరువులు, కుంటలు నాలుగైదు రోజుల కిందట కురిసిన వర్షాలతో చెరువులలోకి నీరు రాగా నిండుగా మారాయి. మండలంలోని ఓ చెరువు ఇలాగే నిండు కుండగా మారగా సాయంత్రం సమయంలో చెరువు గట్టున ఉన్న ఓ వృక్షం చెరువులో ఉన్న నీటితో ప్రతిబింబిస్తూ చూపరులను ఆకట్టుకుంది.


కోతకు గురైన వంతెనను పరిశీలిస్తున్న దృశ్యం

కోతకు గురైన వంతెన పరిశీలన

బాన్సువాడ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని సంగోజీవాడి కోనాపూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన వరదనీటి ఉధృతికి కోతకు గురి కావడంతో శనివారం డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వరద ఉధృతికి నేలకొరిగిన పంటలను ఆయన పరిశీలించి బాధితులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తమసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ఆనంద్, నాయకులు మోహన్ నాయక్, రాజేశ్వర్‌గౌడ్, నారాయణరెడ్డి, హన్మండ్లు, ఎజాస్, నార్ల సురేష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.


తుక్కోజీవాడిలో పంటలను పరిశీలిస్తున్న ఏవో ప్రజాపతి

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

సదాశివనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో నీట మునిగిన, వరదలకు కొట్టుకుపోయిన పంటలను వ్యవసాయాధికారి ప్రజాపతి శనివారం పరిశీలించారు. అతిభారీ వర్షాలు కురవడంతో మండలంలో తీవ్ర పంట నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంటల వివరాలను ఆయన వెల్లడించారు. 800 మంది రైతులకు చెందిన 1125 ఎకరాల వరి పంట, 752 మంది రైతుకు చెందిన 1028 ఎకరాల పత్తిపంట, 950 మంది రైతులకు చెందిన 1454 ఎకరాల మొక్కజొన్న, 252మంది రైతులకు చెందిన 317ఎకరాల సోయా పంట నష్టపోయినట్లు తెలిపారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, రైతులు తమ పంటల్లో నిల్వ ఉన్న నీటిని వంపు ప్రాంతాల్లో గన్లు ఏర్పాటు చేసి దిగువకు వదలాలని ఆయన తెలిపారు. ఏఈవోలు తమ తమ క్లస్టర్‌లో కూడా పంట నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తూ దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగిందన్నారు.


బలరామ జయంతి సందర్భంగా రైతును సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా బలరామ జయంతి

సదాశివనగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి ఆధ్వర్యంలో రైతు దినోత్సవం సందర్భంగా బలరాముని చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్‌ను, 75 సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తున్న రైతులను, రైతులకు సేవలందిస్తున్న విద్యుత్ జూనియర్ లెన్‌మెన్ లింగంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కోతి లింబారెడ్డి, కార్యదర్శి తాడ్వాయి రవి, జోనల్ అధ్యక్షుడు ఏనుగు లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు కలుగకుండా జనరేటర్ ఏర్పాటు

రాజంపేట,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాపూర్‌తండా, నడిమి తండా గ్రామాలను విద్యుత్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదలకు 33 కేవీ కొండాపూర్ ఫీడర్, ఎల్లాపూర్‌తండా, నడిమితండాలను పరిశీలించి విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. ఎల్లాపూర్‌తండాలో తాగునీటి కోసం రెండు జనరేటర్‌లను పెట్టామని తెలిపారు. రోడ్లు ధ్వంసం కావడంతో ఆలస్యం అవుతుందని త్వరలోనే విద్యుత్ సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. గ్రామస్థులకు మంచినీటి కోసం ఇబ్బందులు లేకుండా బోర్ మోటార్ నడిచే విధంగా జనరేటర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ సుదర్శన్, ఏఈ నాందేవ్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆటలాడుతున్న మహిళలు

వినాయక మండపాల వద్ద మహిళలకు పోటీలు

బాన్సువాడ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో వినాయకచవితి సందర్భంగా మండపాల నిర్వాహకులు మహిళలకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో మహిళలు కబడ్డీ ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. ప్రతీ యేటా వినాయకచవితి, దేవి నవరాత్రోత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మత్తమాల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల బృందం ఆధ్వర్యంలో శనివారం ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ శరత్ తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ సంతోష్, ఏఎన్ఎం ఇందిరా, ఆశా కార్యకర్తలు లావణ్య, సంధ్య, సవిత, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి : ఎంపీడీవో

పెద్దకొడప్‌గల్/బాన్సువాడ రూరల్/జుక్కల్/బీర్కూర్,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఇటీవల విడుదల చేసిన గ్రామాల వారీ ఓటరు జాబితాలో అభ్యంతరా లుంటే తెలపాలని ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి ఆయా రాజకీయ పార్టీల నాయకులకు సూచిం చారు. మండల పరిషత్ కార్యాలయంలో శని వారం వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఓటరు సవరణ జాబితా అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతు ఓటరు జాబితాను శుక్రవారం సా యంత్రం ఆయా గ్రామాల పంచాయితీ కార్యాలయాల వద్ద నోటీస్ బోర్డులో ఉంచడం జరిగిందని,ఇందులోఏవైనా అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం వరకు తె లిపితే వాటిని సవరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒకవేళ ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే సెప్టెంబరు 2న తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుందని తె లిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్, వివిధ పార్టీల నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చిప్ప మోహన్, సంజీవ్, నాగ్‌నాథ్‌పటేల్,పండరి,ప్రేమ్‌సింగ్, తానాజీ, బస్వ


పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

రాజ్ తదితరులు పాల్గొన్నారు.బాన్సువాడ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచాయతీ ఎన్నికల డ్రాఫ్ట్ లీస్టును, పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, సూపరిండెంట్ ముజాహిద్, ఆయాపార్టీల ప్రతినిధులు తుప్తి శివప్రసాద్, రవీందర్, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఓటర్ జాబితాపై పరిశీలన చేయా లని ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యద ర్శులు ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాల యంలో కార్యదర్శుల సమీక్ష సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామాలలో ఓటర్ జాబితా పరిశీలించి వార్డులు విభజించాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఓటర్ జాబితాలో ఉన్న పేర్లు గ్రామంలో నివసిస్తున్నారా అదేవిధంగా ఒక వ్యక్తికి రెండు చోట్ల పేర్లు ఓటర్ లిస్టులో పేరు ఉండవద్దని ఆయన సూచించారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్యదర్శులు ఓటర్ జాబితా ఫైనల్ చేసి గ్రామ పంచాయతీ బోర్డుపై అందించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాము, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. బీర్కూర్ స్థానిక సంస్థలకు సంబంధించి ఇటీవల ఓటరు జాబితా విడుదల చేశారు. ఇదిలా ఉండగా శనివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రా వాలని కోరారు. అభ్యంతరాలను స్వీకరిస్తామ న్నారు. డబుల్ ఓటర్లను తొలగిం చాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎంపీడీవో మహబూబ్, సూపరిండెంట్ భాను ప్రకాష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులను నష్టపరిహారం ఇవ్వాలి

ఎల్లారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనా వేసి తక్షణమే ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందిచాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ఎల్లారెడ్డి మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో వర్షాల్లో కొట్టుకుపోయిన పంటలను ఆయన పరిశీలించారు. అలాగే పౌల్ట్రీ ఫార్మ్ సైతం వరదల్లో కొట్టుకుపోయిన ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఎల్లారెడ్డి మండల అన్నసాగర్, అజామాబాద్, తిమ్మారెడ్డి, తదితర గ్రామాలలో పర్యటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారులను పంపించి పంటనష్టాన్ని అం.నా వేసి ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీష్‌కుమార్, ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీ అధ్యక్షులు నర్సింలు పాల్గొన్నారు.

● తెగిపోయిన చెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ..

ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గల పెద్దచెరువు కట్ట ఇటీవల కురిసిన భారీ వర్షానికి తెగిపోవడంతో చెరువు కట్టను ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ పరిశీలించినట్లు డీఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ త్వరలోనే తాత్కాలిక చెరువు కట్ట పునర్నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి ముంపు ప్రాంత రైతుల పంటలను రక్షించడానికి


నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేల జాజాల

కృషి చేస్తామని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంటలు ముంపుకు గురై పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి లక్ష రూపాయల నష్టపరిహారం అందించాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ కోరారు. ఆయన శనివారం మండలంలోని బంజారా, నాగిరెడ్డి పేట, చీనూర్, వాడి తదితర గ్రామాలో భారీ వర్షాలకు వరద నీటి వల్ల నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన పోచారం ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు సిద్దయ్య, దుర్గా రెడ్డి, మోతే శ్రీనివాస్, మురళి, సంతోష్ గౌడ్, వంశీకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిలను పరిశీలించిన ఎమ్మెల్యే రమణారెడ్డి


పాల్వంచలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

పాల్వంచ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పాల్వంచ వాగు, చుక్కాపూర్ బండ రామేశ్వర్‌పల్లి మధ్యగల బ్రిడ్జిల వద్ద రోడ్లను శనివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని దెబ్బతిన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజు, మండల అధ్యక్షుడు అనీల్, కార్యదర్శి రాఘవచారీ, శ్రీనివాస్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

భిక్కనూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలో భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోంటున్న 50 కుటుంబాలకు శనివారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింబాద్రి, విజయ్‌గౌడ్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట పనులను వేగవంతంగా చేపట్టాలి

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలో ఇటీవల కురిసన వర్షం దాటికి తెగిపోయిన రోడ్లు చెరువు కట్టల పనులను వేగంగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా కోరారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేవంతో మండల పరిధిలోని కళ్యాణీ, వెంకటాపూర్ ప్రధాన రోడ్లను తిమ్మాపూర్ చెరువు కట్టలను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట సొసైటీ డైరెక్టర్ గోపీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సంజీవులు, గురు ప్రతాప్, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నాం

నసురుల్లాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండలంలోని నెమలి, నాచుపల్లి, కంపెట్ పల్లి గ్రామాలలో నీట మునిగిన వరి పంట పొలాలను శనివారం ఏఈవో గ్రీష్మ పరిశీలించారు. . ఆమె వెంట రైతులు సున్నం సాయిలు, బేగరి శంకర్, పట్లోళ్ళ రాంరెడ్డి, నాయిని అంజయ్య, తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులు స్వగ్రామానికి తరలింపు

నిజాంసాగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం మరిపల్లి ముంపు బాధితులను శనివారం అచ్చంపేట శివారు గ్రామమైన మర్పల్లి గ్రామానికి తరలించారు. ఇటీవల భారీ వర్షాలకు నిజాంసాగర్ లోనికి భారీ వరద నీరు రావడంతో ప్రాజెక్టు 20 గేట్లు వేయడంతో గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ముందు జాగ్రత్తగా అధికారులు అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఫంక్షన్ హాల్ గోరుగల్‌కు తరలించారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలు అనిర్వచనీయం

- బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడటౌన్ , ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి) : విపత్తు సమయంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందించే సేవలు అనిర్వచనీయమని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శనివారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆమె ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల బాన్సువాడ డివిజన్‌లో కురిసిన భారీ వర్షాలతో చాలా మంది వరద నీటిలో చిక్కుకున్నారని , వారిని కాపాడటంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్ , తదితరులున్నారు.

వరదలతో నష్టపోయిన పంటల పరిశీలన

మద్నూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తడి హిప్పర్గా, గోజెగావ్, సోనాల గ్రామాలలో వరుసగా కురిసిన వర్షానికి నీట మునిగిన పంటలను మండల వ్యవసాయ అధికారి రాజు శనివారం పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను గ్రామాల వారీగా సర్వే చేసి పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. మండలంలో సుమారు 2,600 ఎకరాల వరకు సోయా, పత్తి, పెసర, మినుము పంటలు వర్షానికి దెబ్బ తిన్నట్టు గుర్తించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సరోజ, గజనన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

● జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జహీరాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు బీబీ పాటిల్ కోరారు. ఆయన శనివారం పోచారం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, బీజేపి ప్రధాన నాయకుడు రాజ్ మోహన్ రెడ్డి, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు నాయకులు ఈశ్వర్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పై సమావేశం

మద్నూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా పై ఆయా పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాణి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రదర్శించిన ఓటర్ లిస్టులు పరిశీలించి, ఎక్కడైనా తప్పులు, లోపాలు ఉంటే వెంటనే గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకట నరసయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు, బిజెపి అధ్యక్షులు తెప్ప తుకారాం, టిఆర్ఎస్ నాయకులు ధరస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకత చూపించాలి

రామారెడ్డి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ పారిశుధ్య పనులను ఇబ్బందులను తీర్చుటకు అధికారులు కృషి చేయాలని రామారెడ్డి మండలం ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి ఎంపీడీవో కే. నాగేశ్వర్ గుప్తా, తహశీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్, మండల పంచాయితీ అధికారి ఏలేటి తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు క్రాంతి కుమార్, ఎఎంసి డైరెక్టర్ ఎండి రావుఫ్, రాజకీయ నాయకులు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను పరామర్శించిన ఎంపీ

మద్నూర్/మహమ్మద్‌నగర్/ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఉమ్మడి మద్నూర్ మండలంలోనీ ఆయా గ్రామాల్లోకి వరద నీళ్లు రావడంతో ఆ గ్రామస్తులను ఖాళీ చేయించి మద్నూర్, డోంగ్లి సహాయ కేంద్రాలలో వారికి ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. శనివారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మద్నూర్ సహాయ కేంద్రాలలో వరద బాధితులతో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభు త్వం బాధితులందరికీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయనతో పాటు మద్నూర్ మార్కె ట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మాజీ జెడ్పిటిసి సాహెబ్ రావుఉన్నారు.

వరద బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మహమ్మద్‌నగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామపంచాయితీ పరిధిలోని బొగ్గు గుడిసె చౌరస్తాలో గత రెండు రెండు రోజుల క్రితం అకాల వర్షాలతో ఎగువనున్న కుంటలు, చెరువులు తెగిపోడంతో ఎన్నడూ లేనివిధంగా ఒక్కసారి వరద ఉధృతంగా ప్రవహించి టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతరితర దుకాణాలు పూర్తిగా నీటి ప్రవాహంలో కోటుకుపోగా శనివారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిందే, మాజీ జడ్పీ చైర్మన్ ధఫేదార్ రాజు, ఉమ్మడి నిజాంసాగర్ మండలాల నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గారెడ్డి, సత్యనారాయణ, రమేష్‌గౌడ్, వాజిద్ అలీ, సంగమేష్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- వార్-2
ప్రియ 35- మహావతర్ నరసింహ
దర్శన్- పరదా, బన్ బటర్ జామ్

బాన్సువాడ

మహేశ్వరి — బ్రహ్మాండ
వెంకటేశ్వర — కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

డీజేలు.. యమ డేంజర్

(5వ పేజీ తరువాయి)

15 నుంచి 60 రోజులు వ్యవధిలో పిండంలో అంతర్గత అవయవాలు, కేంద్రనాడీ వ్యవస్థ ఏర్పడతాయి. ఇలాంటి సమయాల్లో గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే ఎక్కువగా శబ్దాన్ని వింటే అంతర్గత అవయవాల ఏర్పాటు, కేంద్ర నాడీ వ్యవస్థలో లోపాలు తలెత్తే అవకాశం ఉంది. తల్లి ఎక్కువ శబ్ద కాలుష్యానికి గురైతే తల్లి రక్తనాళాలు సంకోచించి పిండానికి రక్త ప్రసరణ తగ్గుతుంది. ప్రస్తుతం వివిధ ఊరేగింపుల్లో వాడుతున్న డీజేలు 100 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని సృష్టిస్తున్నా యి.

నిబంధనలివి..

నిబంధనల ప్రకారం 70 డెసిబుల్స్ సౌండ్ వరకే అనుమతి ఉంది. అంతకు మించితే చట్టరిత్యా నేరం. రాత్రి 10 నుంచి ఉదయం 6 మధ్య భారీ శబ్దాలతో ఎలాంటి వేడుకలు, ఊరేగింపులు చేయకూడదు. ఆస్పత్రులు, పాఠశాలలు, కోర్టులను నిశ్శబ్ద జోన్లుగా పరిగణిస్తారు. జిల్లాలో ఎక్కడా కూడా ఇది పూర్తి స్థాయిలో అమలుకావడం లేదు. అధికార యంత్రాగం అమలుకు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ శ్రేణులు, వివిధ సంఘాల ఒత్తిడులతో ముందడుగు వేయలేక పోతున్నారు. సాధారణంగా 70 డెసిబుల్స్ శబ్దాలను వినడానికి మానవుల చెవులు సహకరిస్తాయి. 70-85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని ఏడు నుంచి ఎనిమిది గంటలు, 90 డెసిబుల్స్ వరకు నాలుగు గంటల పాటు వినవచ్చు. డీజే శబ్దం 200 డెసిబుల్స్ పైనే ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరం. భారీ సౌండ్ ప్రకంపనలకు చెవుల్లో సున్నిత కణాలు దెబ్బతింటాయి. కర్ణభేరి దెబ్బతిని శాశ్వత వినికిడి లోపానికి దారి తీస్తోంది. ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయి.

పరిమితి దాటితే అంతే..

60 డెసిబుల్స్ లోపు 100 డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 110 డెసిబుల్స్ దాటితే చికాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తోంది. 120 డెసిబుల్స్ దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తల బాధలు వస్తున్నాయి. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతోంది. 190 డెసిబుల్స్ శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతోంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు. పూర్వపు స్థితి రావడం చాలా కష్టం.

అధిక శబ్దాలతో అనర్థం

• డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, భైంసా

అధిక శబ్దాల వల్ల గుండె వేగంగా కొట్టుకొని ఒత్తిడి, బీపీ పెరుగుతుంది. గుండె సంబంధ సమస్యలున్న వారికి కార్డియాక్ అరెస్టు అవుతుంది. రక్తపోటు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావచ్చు. నరాలు దెబ్బతిని కొందరికి పక్షవాతం రావచ్చు. హృద్రోగులు, వృద్ధులు డీజేలకు దూరంగా ఉండాలి.

ఈ పాపం ఎవరిది?

(5వ పేజీ తరువాయి)

పిల్ల కాల్వలు ఉండేవి. ఈ కాలువల ద్వారా ఇతర చోట్ల పంటలకు నీరు అందేలా చేసేవారు. ప్రస్తుతం కామారెడ్డి పట్టణం విస్తరిస్తుండడంతో శివారు ప్రాంతాల్లో కొత్త కాలనీలు వెలుస్తూ వచ్చాయి. ఇందులో భాగంగానే పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో కొత్త కాలనీలు వెలిశాయి. ఈ క్రమంలోనే అక్కడ భూముల విలువల పెరగడంతో చెరువు ప్రధాన కాలువ క్రమేణా కబ్జాలకు గురవుతూ వచ్చింది. ఆ కాలువ కుచ్చించుకుపోయింది. గతంలో ఉన్న వాగు పరిమాణం ప్రస్తుతం కబ్జాలతో చిన్నగా మారిపోయింది. అదేవిధంగా పిల్ల కాల్వలు కూడా కబ్జాలకు గురై చిన్న మురికి కాల్వలుగా మారాయి. కబ్జాలు కావడంతోనే భారీ వర్షాల సమయంలో కాల్వల ద్వారా వెల్లలేని పరిస్థితులలో కాలనీలోకి వరదలు పోటెత్తుతున్నాయి. దీనికి నిదర్శనం తాజాగా పోటెత్తిన వరదలే. చెరువు దిగువన ఉన్న జీఆర్‌కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ వరద ముంపునకు గురయ్యాయని పలువురు భావిస్తున్నారు.

బఫర్‌జోన్‌లు వెంచర్లు, నిర్మాణాలు

వాస్తవానికి చెరువు, కాలువల పరివాహక ప్రాంతాల్లో ఎప్పటికైన వరద వచ్చే ప్రమాదాన్ని అంచనా వేసి ప్రభుత్వాలు బఫర్‌జోన్‌ను ప్రకటించాయి. ఈ ప్రాంతాల్లో అసలు ఎలాంటి వెంచర్లు కానీ, నిర్మాణాలు కాని చేయకూడదు. కాని మున్సిపల్‌లోని కొందరు నేతల ఒత్తిళ్లతో ఇష్టారీతిన వెంచర్లు చేసినా మున్సిపల్‌లోని పలువురు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పటికీ కాలువను ఆనుకొని ఉన్న నిర్మాణాలు అనేకం కనిపిస్తునే ఉన్నాయి. ఇటీవల వరదలో కొట్టుకుపోయిన కొన్ని నిర్మాణాలు కాలువను ఆనుకొని ఉండడం ఏళ్ల నుంచి కనిపిస్తున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని ఆ ప్రాంతంలో నివసిస్తున్న పలువురు పేర్కొనడం గమనార్హం.

ఇతర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి

ప్రస్తుతం వచ్చిన వరదలతో జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడడంతో అధికార యంత్రాంగం ఎక్కువగా దృష్టి సారిస్తోంది. కానీ ప్రతీ ఏటా వర్షాకాలంలో మున్సిపల్ పరిధిలోని పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలుకొని బతుకమ్మకుంట, టీచర్స్‌కాలనీ, సుభాష్ టాకీస్, గాంధీనగర్, వాసవికాలనీ, సిరిసిల్లారోడ్డు నుంచి ఎల్లమ్మగుడి వరకు, సిరిసిల్లా రోడ్డు నుంచి వీక్లి మార్కెట్ పోయే చౌరస్తా నుంచి ఎల్లమ్మగుడి వెనుక భాగం వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ వరద కాలువ ప్రాంతాల ప్రజల పరిస్థితి ఇదే. కాలువ పలుచోట్ల స్లాబ్‌లు పోసి పూర్తిగా మూసివేయడంతో వరద నీరు పోక రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపిస్తుంటాయి. ప్రతీసారి ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచముఖి హనుమాన్ కాలనీ నుంచి మొదలుకొని సిరిసిల్లా రోడ్డులోని కన్యకా పరమేశ్వరి కమాన్ వరకు గత నాలుగు రోజుల కిందట వరద నీరు పోక రోడ్లన్నీ చిన్నపాటి చెరువులను తలపించాయి. ఇలా పలువురు నేతల ఒత్తిళ్లు, అధికారుల నిర్లక్ష్య పనితనంతో ఇతర ప్రాంతాల ప్రజలు కూడా నానా అవస్థలు పడి వరదల బారీన పడాల్సి వస్తోంది.

శాంతించిన మంజీరా

(5వ పేజీ తరువాయి)

వదలుతూ పూర్తి నీటి మట్టాన్ని నిలువ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు కొనసాగుతూ ఉండటంతో సందర్శకుల రద్దీ తగ్గడం లేదు. సందర్శకులు అదుపు చేయడంలో పోలీసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుల్తాన్‌నగర్ ప్రధాన రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయిస్తూ కాలినడకన వెళ్లి నీటిని అస్వాదించేందుకు అనుతించారు. దీంతో సందర్శకులు కాలినడకన వెళ్లి నీటిని ఆస్వాదిస్తూ కేరింతలు వేస్తూ సెల్ఫీలు దిగుతున్నారు. 36 ఏళ్ల తరువాత ఇలాంటి భారీ వరద రావడం నిజాంసాగర్ నిర్మాణంలోనే రెండోసారి రైతులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

రామారెడ్డి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి ఎంపీడీవో కే. నాగేశ్వర్ గుప్తా పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా ఇందిరమ్మ మాడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఏలేటి తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, కాంట్రాక్టర్ ఎండి. రావుఫ్, అధికారులు, మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.